# శిల్పం

శివాలయంలో ఆ సాయం సమయమున యథావిధిగా దేవుని ముందు గంట అయిదు సార్లు మ్రోగింది. రెండు గంటల తరువాత కొద్దిగా వ్యవధి మరి రెండు గంటలు. తరువాత అంతే వ్యవధి. తరువాత ఒక గంట మొత్తంఅయి గంటలు ఆలయ ప్రాంగణంలోనితోటలోనిపూలను కోస్తున్న చంద్రంకలవర పడ్డాడు.

"అయ్యో! ఈ రోజు నేనే వెనుకపడ్డాను. కమల అప్పుడే వచ్చేసింది" అనుకుంటూ కోసిన పువ్వులను అరటాకు దొన్నెలో సర్ది కళ్యాణ మంటపంలోకి వెళ్ళాడు చంద్రం. అప్పటికే కమల అక్కడికి వచ్చేసింది.

"పట్నం నుంచి వచ్చే సరికి ఆలస్యమైపోయింది కమలా! అందుచేత ఎక్కువ పువ్వులను సేకరించలేక పోయాను." నొచ్చుకుంటూ అన్నాడు చంద్రం.

"దేవుడికైనా ప్రాప్తం ఉండాలిగా. కూర్చో. పూజారి తాతయ్య ఇంకా రాలేదు. ఈ రోజున పూలన్నీ దేవుడికేయిచ్చేద్దాం. తక్కువ పూలే ఉన్నాయిగా. నేను మరి మాల కట్టుకోను "అంటూ

కాళ్ళను మెట్లమీద ఉంచి కూర్చుని ప్రక్కకు తిరిగి మాల కట్టే ప్రయత్నంలో నిమగ్నమైంది.

"తాతయ్య ఇంకా రాలేదుగా. నేను వెళ్ళి మరిన్ని పూలు కోసుకొస్తా" అంటూ రెండు మెట్లు దిగి ముందుకు పోబోయాడు చంద్రం.

"ఆగు దేవుణ్ణిచూశాక ఇద్దరం తోటలోకి వెళ్దాం" అని కమల అంటూంటే ముందుకు పోబోతున్న చంద్రం వెనుకరిగి కమలవైపు చూశాడు. విశాలమైన పసిమి వన్నె నుదిటి మీద ముంగురులు చల్లగాలికిలాస్యం చేస్తూంటే. అందమైన ఆమె కను బొమ్మల మధ్య ఎఱ్ఱని తిలకం అందంగా మెరుస్తూ, పొడవుగా సూటిగా పోయే సన్నని ముక్కునే పరికిస్తూంటే, వంపులు తిరిగిన ఎఱ్ఱని పెదవులు సన్నగా నవ్వుతూంటే ముందుకు పోబోయే చంద్రం అక్కే నిలబడిపోయాడు. కనురెప్పల మధ్య కదులుతూ మెరిసే కళ్ళను చూచి "కమలా! కదలకు" అన్నాడు.

ఒక మెట్టుపై ఒక పాదం, క్రిందమెట్టుపై రెండో పాదం ఉంచి ప్రక్కకు తిరిగి పూలమాల కట్టే ప్రయత్నంలో నిమగ్నం కానున్న కమల చంద్రంపైపు కొద్దిగ తిరిగి ఎందుకన్నట్టు కను బొమ్మలు ముడిచింది.

"కమలా నీవలాగే కూర్చో. ఇప్పుడు నీవెలాగున్నావో తెలుసా? పాలరాతి బొమ్మలా ఉన్నావు. ఊపిరితీసుకునే శిల్పంలా ఉన్నావు. అమృతాన్ని పంచవచ్చిన మోహినిని నేను చూడలేదు. కాని ఆమే జగన్మోహిని అయితే నీవామెను మించినదానవు. ప్రక్కకు వంచిన ముఖాన్ని అలాగే ఉంచు కుడిచేతినితొడపై అలాగే ఉంచు. లేతపసుపురంగు చీరలో నీవెంత అందంగా

ఉన్నావో తెలుసా? ఏ శిల్పి ఇంతవరకు చెక్కని అందమైన శిల్పంలా ఉన్నావు. కమలా! రేపుసాయంత్రం ఈవేళకినీఅందాన్ని" అద్దం కట్టినట్టు చిత్రించి నీపాదాల దగ్గరుంచుతాను."

"చంద్రం నీకు రానురాను కవిత్వంకూడ అబ్బుతోందే

"నిన్ను చూస్తుంటే కవిత్వం ఆబ్బటమేకాదు. ఏమైనా అవుతుంది కమల. చెక్కు చెదరని అందాల శిల్పానివి నీవు. పూలతో ఆ శివుణ్ణి కాదు, నిన్నే పూజించాలి. ఆగు, తోటలోని పూలన్నింటిని తెచ్చి నీ పాదాంకితం చేస్తాను." అంటూ పరుగెత్త బోయాడు. చంద్రం.

"వెళ్ళకు చంద్రం, ఇలారా! ఇలా కూర్చో"

"అలాకాదు. నన్ను తోటలోనికి వెళ్ళనివ్వు"

"వెళ్ళకు చంద్రం. ఆగు. ప్రతీరోజు ఇలానే కాలమంతా వ్యర్థమైపోతోంది. పూజారి తాతయ్య రాగానే నే దేవుణ్ణి చూచి వెళ్ళిపోతాను. ఆవేళకు మంగతాయారు వస్తుంది. కాబట్టి నీతో మాట్లాడటమేకాదు. అసలు నిన్ను చూచినట్టే అనిపంచదు. ఇంటి కెళ్ళి ఆలోచిస్తుంటే ఇది ఒక కలేమో అనిపిస్తుంది. వచ్చేంతవరకు ఆరాటం. వచ్చిన తరువాత చూస్తున్నా మాటాడుతున్నా ఆస్పృహే ఉండదు. చంద్రం నీవు వెళ్ళకు కూర్చో"

ఆమె మాటల కంగీకారాన్ని తెలియజేస్తున్నవానిలా వెను కకు వచ్చి, ఆమెకు సమీపంగా స్తంభం ప్రక్కన కూర్చుంటూ.

"నిజమే కమలా! నాకూ అలానేఅనిపిస్తుంది. నీవు వచ్చేంత వరకు ఎప్పుడు వస్తావు. ఎప్పుడు వస్తావన్న ఆరాటం, ఎన్నో మాట్లాడుకోవాలని ఎన్నో చెప్పుకోవాలని, అనిపించటం, నీవు వచ్చిన తరువాతనే నే మవుతానో.... నాకే తెలియదు. చెప్పాలనుకున్నది చెప్పలేను. నీవువచ్చే వేళవుతోందంటే గుండె

ఎంతగా స్పందిస్తుందో తెలుసా? నీవు రావటం ఆలస్యమైతే గుండెమీద ఎన్ని సమ్మెటపోట్లు పడతాయో తెలుసా? నేనింతటి పెద్ద చిత్రకారుడవటానికి కారణం నీవు. నా పేరు ప్రఖ్యాతులకు కారణం నీవు. నీ పాదాల దగ్గర వాడిపోని పువ్వుగా ఉండే అదృష్టాన్ని కలుగజెయ్యి కమలా "ఈ జీవితంలో ఇంతకన్నా నే కోరుకునే దేదీ లేదు"– అతని కనులు ఆర్ద్రాలయినాయి.

"ఆ అదృష్టం ఉండవలసిందినాకుగాని, నీకు కాదు చంద్రం నీవెవరో తెలియనప్పుడు నేను శిలను మాత్రమే. నన్నుశిల్పంగా తీర్చిదిద్దిన శిల్పివి నీవు. బండరాతిలాంటి గుండెలో చైతన్యం కలుగచేసింది నీవు. అభిమానం, ఆత్మీయత, ప్రేమ. చైతన్యం స్పందన, ఏమీ లేని నాలో భావావేశాలను కలుగజేసిన అద్భుత వ్యక్తివి నీవు. "నిన్ను....నిన్ను...." ఆమె గొంతు క్రమంగా వణకసాగింది. కనులు అశ్రుపూరితములయినాయి.

అంతలో గంట మూడుసార్లు మ్రోగింది.

"అదిగో పూజారి తాతయ్య!" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"ఈరోజెంత ఆలస్యమయిపోయిందో" అనుకుంటూ చంద్రం పూలనందిస్తూంటే మాల నల్లటం పూర్తిజేసింది కమల.

కమలచేతి నుండి పూల సజ్జ నందుకుంటూ "కమలా! ఇది నా దృష్టి దోషమా? లేక నిజమేనా? నీ కళ్ళు వగడాల వలె ఉన్నాయమ్మా!" అన్నాడు పూజారి తాతయ్య.అమె ఏదో చెప్పేలోగా అతనే అందుకుని.

"చంద్రం! ఇంకా ఆమూడుముళ్ళు వేయుకఎందుకాలస్యం?" అన్నాడు.

"మీ దీవెన ఉండాలిగానీ, అదెంతసేపు తాతయ్యా!" అన్నాడు. చంద్రం దేవునికి నమస్కరిస్తూ.

"నా దీవనలు లేని దెప్పుడురా చంద్రం? ఈ చైత్రంలో ఆ శుభకార్యం అయిందనిపించు. కళ్ళారా చూస్తాను శివ పార్వతుల కళ్యాణం చూచినంత అదృష్టం కలిగిందనుకుంటాను." అన్నాడు.

"ఉద్యోగంలో స్థిరపడాలని ఇంతకాలమూ జాప్యం చేశాను. తాతయ్యా! ఇక ఆ అడ్డులేదు. అమ్మకూడ చైత్రంలోముహూర్తం పెట్టిస్తానంది. ఇంకా మీతో చెప్దామని."

"ఆరిని భడవా! ఎంత కథానాయకుడవైనావు! అమ్మా కమలా! వీడు టక్కరి గుండెలో మాట పైకి రానివ్వడు. జాగ్రత్త!"

"అలా అయితే నా గుండెలోనే ఉంచుకుంటా తాతయ్యా!" అంది కమల.

"ఇద్దరూ తోడు దొంగలే!" అంటూ నవ్వుకుంటూ గుడిలోకి నడిచాడు పూజారి తాతయ్య.

పట్నానికి రెండు మూడు మైళ్ళ దూరంలో ఇరుపైపులా చేలు తోటలు ఉన్న నదీ ఒడ్డునున్న ఆ పల్లెటూరు ఒకప్పుడు పెద్ద గ్రామమే. కాని ఆ గ్రామానికి ప్రక్కగా ప్రవహించే నది తాకిడికి సగం గ్రామం ఆహుతి కాగా ఇసుక గుట్టలు ఒకప్రక్కగా పోగులు పడి ఉండగా, ప్రతి సంవత్సరం ఏర్పడే వరదకు తాళలేక చాలా మంది ప్రక్క గ్రామాలకు పట్నాలకు తరలిపోయారు. ఊరును ఆస్తులను వదలి పెట్టలేని వారు ఎత్తు ప్రదేశాలలో ఇళ్ళు కట్టుకున్నారు. ఈ విధంగా గ్రామం క్షీణించి

పోయింది. నదీ తీరానికి దూరంగా ఎత్తులో ఉన్న భాగంలో నాలుగయిదు పెంకుటిళ్ళు, రెండు మూడు డాబా యిళ్ళు వాటిమధ్య అటూ యిటూ వుండే పూరిళ్ళు వీటన్నిటి చివర ఉన్నతంగా నిలిచిన శివాలయం- మిగిలిన గ్రామ స్వరూపం. శివాలయాని కొద్ది దూరంలో మామిడి తోట. తోట వెనుక ఒక కొబ్బరితోట-తోట మధ్యగా ఒక పర్ణశాల, పర్ణశాల చుట్టూ బారులు తీర్చిన వివిధ రకములయిన పువ్వుల మొక్కలు, తోటలో నిర్ణీత ప్రదేశాలలో నిమ్మ, నారింజ చెట్లు కనిపిస్తాయి. ఆ తోటమాలి ఆ పర్ణశాలకు యజమాని చంద్ర. అతనిని కనిపెట్టుకు ఉండే అతని తల్లి అతనికిపెద్దదిక్కు. నదీ తీరానికి దగ్గరగా ఉండే అతని మేడ, తన తండ్రి పోయిన సంవత్సరమే వరదలకు ఆహుతి అయింది. పట్టణ జీవితానికి అలవడలేని చంద్రం, నదికి దూరంగా ఊరివెనుక తోటలో పర్ణశాల కట్టుకుని ఉన్నాడు. చిత్రకళలో అభిరుచి ప్రవేశం గల చంద్రం, కాలేజీ చదువులకు పరుగులుతీయక, తానంతటతానే గీతలకు రూపులుదిద్దటం, ప్రారంభించాడు. అదృష్టవశాత్తు అతని ప్రతిభను కనిగపెట్టగల చిత్ర కారుడు తారసపటం. అతనిచేతకుంచెను పట్టటంలో మెలకువలు తెలియజేయటంజరిగింది. చంద్రంకు అదే మంచి అవకాశ మయింది. ఒక పత్రికలో ఆర్టిస్టుగా నియమింపబడటానికి అతని ప్రతిభే కారణమయింది.

“నీవెంత అందంగా చిత్రాలు గీస్తావు.” అని కమల అతని చిత్రాలు చూసి మెచ్చుకుంటూంటే.

“నా చిత్రాలంత అందంగా ఉండటానికి కారణం నీవేగా కమలా! నా చిత్రాలలో గీతలు కదలటానికి కారణం నీవు. నా చిత్రాలకు జీవం నీవు. అసలు నేను ఆర్టిస్టు నవటానికి కారణం నీవే కమలా!“ నిజాయతీ ధ్వనించే కంఠంతో అన్నాడు.

అతని మాటలు ఆమెకు గర్వాన్ని కల్గిస్తాయి. అయినా వాదన కోసం అంటుంది.

"నాలో ఏముంది? అదీ నీ దృష్టిలో ప్రత్యేకత. నీకు మబ్బుల్లోనూ అందమైన చిత్రాలే కనిపిస్తాయి. నీళ్ళలో పట్టిన నాచులోను, నేల మీద ఒలికి పోయిన నీరు ప్రవహించే తీరులోనూ, సిరామరకలోనూ. చిన్న పిల్లాడు గీసిన గీతలోనూ చిత్రాలే కనిస్తాయి. నీ వెన్నిసార్లు నాకు చూపించలేదు?"

"అలా ఆలోచింపజేసేది నీవేగా?"

అసలు. ఆలోచించటమే చేతగాని నేను నిన్ను ఎలా ఆలోచింప జేస్తాను. నేనొక బండరాతిని. నీవు నన్ను శిల్పంగా మార్చావు."

"అవును. బండరాళ్ళే ఆలోచింప జేస్తాయి. ఈ బండరాతిని శిల్పంగా మార్చటమెలా అన్న ఆలోచనే నా చేత గీతలు గీయించింది. ఆ గీతలే నాకు ప్రతిభను తెచ్చాయి.

"ఇప్పుడు నేను శిలనా? శిల్పాన్నా?" బుగ్గక్రింద చేతులుంచుకుని అడిగింది.

"ఆలోచించటం నేర్పిన సజీవ శిల్పానివి. బండరాతి గుండె ఉన్న నిన్ను ఆలోచింప జెసింది నేనే."

"అదీ నిజమే బండరాతిలా ఉన్నప్పుడే హాయిగా ఉండేదీ ఇప్పుడో నీ గురించి ఆలోచించని క్షణంలేదు. ఈ ఆలోచనలు ఎంత ఆనందాన్నిస్తాయో, అంత బాధా పెడతాయి. చంద్రం! నీ నైపుణ్యంతో నా మనసునందంగా చెక్కావు. కాని ఆ ఉలితోటే నా మనసును మాత్రం ముక్కలు చేయకు చంద్రం, ఆదుఃఖాన్ని నేనుమాత్రం భరించలేను. ఆమె కనులు అశ్రుపూరితాలయ్యాయి.

"ఈ బాధ నీకేనా? నాకు మాత్రం లేదునేడో రేపో ఉద్యోగం స్థిరపడుతుంది అప్పుడు మనమిలా వుండనక్కరలేదుగా? "అన్నాడు చంద్రం ఆమె చేతులను సున్నితంగా నిమురుతూ.ఆమెతృప్తిగా ఆనందంగా నవ్వింది.

ఇద్దరూ ఎదురుచూచినరోజు రానేవచ్చింది.

చంద్రం ఉద్యోగానికి నిలకడ కలిగింది.

పూజారి తాతయ్య ఆశీర్వాదాన్ని తీసికుని "కమలా! ఈ రోజు మా తోటలోకి వెళ్ళి వద్దాం, క్రొత్తగా గీసిన చిత్రాలు చూద్దువుగాని'' అంటూ ఆమెను తోటలోకి తీసికెళ్ళాడు. ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ తోటలోకెళ్లారు. ఆ తోటలో తనకోసం ప్రత్యేకంగా ఏర్పరచుకున్న కుటీరంలోనికి తీసికెళ్ళాడు. ఆ కుటీరంలోనికి ఆమె చాలసార్లు వెళ్ళింది. అతను కొత్త చిత్రాలు గీసినప్పుడల్లా ఆమె అక్కడికి వెళ్ళటం పరిపాటి. ఆ తోటలోనూ ఇద్దరూకలిసి తిరిగారెన్నో పర్యాయాలు. భవిష్యజ్జీవితం మీద ఎన్నో ఆశలతో ఏ ఏ ప్రణాళికల నెలా అమలు పరచాలో నిర్ణయించుకుంటూ కలయతిరిగారు. పూవుల నెన్నింటినో కోసుకున్నారు. ఏపని చేస్తున్నా కమలకి ధీమాగా గర్వంగా ఉంది. ప్రతీ వస్తువు తనదే అన్న ధీమాతో తిరిగింది. కమలనుచూచి చంద్రం తల్లి తృప్తిగా నవ్వుకుంది. కమలనుదగ్గరికి తీసికుంటూ"ఇంకెంత కాలమే తల్లీ! ఒక్క రెండు నెలలు. మూఢం వెళ్ళిపోగానే ముహూర్తాలు పెట్టించమని మీ నాన్నకు చెప్తా. ఇంతకూ మాటవరసకైనా నీ యిష్టాన్ని మీ నాన్నకు చెప్పావా? డబ్బున్నవాడు. కాదనడు కదా!" తన సంశయాన్ని వ్యక్త పరిచిందామె.

"నేనేమీ చెప్పలేదత్తయ్యా! కాని నాన్నగారు నా మాటను కాదనరు. మాఅమ్మకు తెలుసు. అమ్మకు ఇష్టమే. అమ్మమాట నాన్న కాదనరు."

"చంద్రానికి మాత్రం ఏమి తక్కువ? ఆస్తిపాస్తులు మీఅంత లేకపోవచ్చు. కాని మీరంతా గర్వపడే గొప్పవాడు చంద్రం; చంద్రాన్నే కాదంటారా మీ నాన్న?"

"కాదంటే మాత్రం నేనూరుకుంటానా అమ్మా! కమలను ఎత్తుకొచ్చేయనూ?" అన్నాడు చంద్రం ధీమాగా.

"అమ్మా! ఆశా!" అన్నట్టు చూచింది కమల.

"అంతవరకు రాదులే కమలా! చంద్రం! చీకటి పడుతున్నట్టుంది. కమలను తీసికెళ్ళి దిగవిడచిరా" అంటూ ఇద్దర్నీ పంపేసిందామె. నిజమే. ఆకాశం మబ్బుపట్టింది. ఒక్కసారి చల్లగాలి వీయసాగింది.

"వర్షం వచ్చేస్తుందేమో కమలా! కొద్దిసేపు ఆగకూడదూ?"

"వద్దు చంద్రం నేనిక్కడున్నట్టు నాన్నగారికి తెలియకూడదు. త్వరగాపద. కోవెలను చేరాలి వర్షం వచ్చేలోగా" అంటూ అతని చెయ్యిపట్టుకుని ముందుకు లాగింది కమల. ఆమెఅలా అంటూనే వుంది' వర్షపు చినుకులు పడసాగాయి.

"ఆగు కమలా!" వారించాడు చంద్రం. కమల వినలేదు. మామిడితోట చేరేసరికి వాన పెద్దదయింది. కమలపరుగెత్తుకుంటూ కోవెల చేరింది, ముడొంతులు తడిసిపోయిన కమలనుచూచి "గొడుగు తెచ్చేందుకైనా అవకాశమిచ్చావుకాదు" నొచ్చుకున్నాడు చంద్రం. ఇద్దరూ కళ్యాణమండపంలోకి చేరారు.

"ఇప్పుడు మాత్రం ఏముయింది. కొద్దిగా తడిశానంతే" అంటూ తనవైపు చూసుకుంది. పార్వతీదేవి శిల్పానికి ప్రక్కగా నిలబడుతూ మెరుపుల్లో కమలని చూశాడు. ఆ మసక వెలుగులో,

మెరుపుల కాంతులలో, కమల ప్రక్కకు తిరిగి పైటకొంగును పిండుకోబోతూ కనిపించింది. అద్భుతమైన ఆ భంగిమను చూస్తూ రెండడుగులు ముందుకు వేశాడు చంద్రం. తడిసిన ముంగురులు ఆమె నుదిటిపై కదలక నిలచివుండగా, పొడవైన కేశాలు బుగ్గలను, కంఠాన్ని దాటాయి. మెరుపులు పయ్యెద తొలగిన వక్షంపై భుజములపై, ఊరువులపై పడి ప్రతిఫలించ సాగాయి. నుదిటిపైన చేరిన నీటి బిందువులు ఆమె బుగ్గలపై పడి, అక్కడ నుండి కంఠం మీద పడి వక్షోజాలపై పడి దారుల వెతుక్కుంటున్నాయి. చీకటిలో మెరుస్తోంది కమల "కమలకాదు అప్సర్స. కాదు. నా కమల అప్సర" గొణుక్కుంటున్నాడు చంద్రం. చంద్రం తన్ను చూస్తున్నట్టు కమల చూచిందేమో ఒక్కసారి తలఎత్తి చంద్రం వైపు చూచింది. చంద్రం అప్రయత్నంగా కమలవైపు కదిలాడు. మెరుపు కళ్ళు చెదరగొట్టేటట్టు మెరిసింది. అంతలో భూమిని కబళించేటట్టు ఉరుము ఉరిమింది. కమలే ముందుకు పరుగెత్తుకుని వచ్చిందో, లేక చంద్రమే ముందుకు పరుగెత్తుకుని వెళ్ళాడో వారికే తెలియదు. భయపడుతు చంద్రం కౌగిలిలో ఇమిడిపోయింది కమల. శరీరంలో ప్రవహించే విద్యుత్తుకు సమాధానంగా 'కమలా!' అన్నాడు చంద్రం, అతని గొంతు వింతగా మారిపోయింది. ఆమెను మరీ దగ్గరగా తీసుకునేంతలో కమల అంది "వదులు చంద్రం" అని. చంద్రం వెంటనే ఆమెను వదిలేశాడు. ఆను వెంటనే ఆమె గోడప్రక్కకు వెళ్ళి చీరకున్న నీళ్ళను పిండుకుని, చీరను ఒంటికి చుట్టబెట్టుకుని వచ్చింది. చీకటి ముసురుకుంది. గాలి వీయసాగింది. ఆ గాలికి కమల చీరకుచ్చిళ్ళు పయ్యెద కదులుతూంటే, మెరుపుల వెలుగులో కమల శరీర కాంతులను చూస్తూ చంద్రం తన కుంచెకు మెలకువలు నేర్పుతూంటే కమల అంది. "ఏమిటలా చూస్తున్నావు?"

"ఏంలేదు" తడబడుతూ అన్నాడు.

"ఏమీ మాటాడవేం?"

"నీకు నామీద కోపం వచ్చిందికదా. నేనే తొందర పడ్డాను కమలా!"

"కోపమెందుకు చంద్రం? నిగ్రహం గల నిన్ను నేను దిగ జార్చటం ఇష్టంలేక విడవమన్నాను. ఎప్పటికైనా నేను నీ దాననేగా."

చంద్రం మాట్లాడలేదు. గాలి తగ్గింది. చినుకులు ఆగి పోయాయి.

"నేను వెళ్తాను చంద్రం!" కమల అంది. "వర్షం, కమలా చీకటి" తుళ్ళిపడి అన్నాడు.

"వర్షం తగ్గింది నే వెళ్తాను." అంటూ చీకటిలోకి కదిలింది కమల. చంద్రం చీకటిలోకి కదిలే కమలనే చూస్తు ఉండి పోయాడు.

• • • • •

నిద్రకుపక్రమించే చంద్రానికి "నేను నీ దాననేగా" అన్న కమల మాటలు పదే పదే ధ్వనించ సాగాయి. ఏదోఒకమైన అసంతృప్తి. "ఇన్నినాళ్ళ—ఈ ఆరాధన, శరీరకాంక్ష తీర్చు కోవడం కోసమేనా?" చంద్రానికి నచ్చటం లేదు. నిద్రలేని కలత రాత్రి గడిచింది. ఆ రాత్రిలో ఎన్నికలలు. ఆ కలలలో కమల వర్షంలో తడిసిన కమల—ఉరుములకు భయపడి కౌగిట్లో ఒదిగి పోయిన కమల—తననుండి దూరంగా పోలేని కమల—ఆ చీకటిలో సర్వమూ అర్పించిన కమల—తన ఆనందం కోసం కమలను

హింసించి అనుభవిస్తున్న తను. ఉదయం లేస్తూనే కమలను తలచుకుని కలతచెందాడు చంద్రం. అర్ధరాత్రివేళ కళ్యాణ మంట పంలో కమలను పొందిన భ్రాంతి చాలాసేపటివరకు అతనిని వదలి పెట్టలేదు. తనకంటితో చూడటానికి ఇష్టపడనికమలను, నిర్భీతిగా, సిగ్గులేక, కనులపెద్దవిచేసికుని చూడటానికి మనసు సిగ్గుపడలేదు. తలచుకుంటే చంద్రానికి సిగ్గువేసింది. జరగకూడనిది జరిగినట్టు బాధపడ్డాడు. నాఆనందంకోసం కమలనుఎంత బాధపెట్టాను. కమలను మరచిపోలేక చికాకు పడ్డాడు చంద్రం. "ఛీ! పశువులా ప్రవర్తించాను. అందమైన శిల్పాన్ని రాళ్ళతో కొట్టి బాధించినట్టు హింసించాను.."

"ఎంత హింసించినాబాధకనపరచదేం? ఛీ! ఎంతదుర్మార్గుడిని అందమైన పువ్వును నాశనం చేసినట్టు ........"

అన్య మనస్కంగా సైకిలెక్కాడు చంద్రం. కుంచెపట్ట టానికి మనసొప్పుకోలేదు. తిరిగివస్తున్న చంద్రానికి పోలీసులు ఒక వ్యక్తిని బేడీలువేసి పోలీస్‌వాన్‌లోకి ఎక్కించటం గోచరమైంది, జనమంతావింతగా చూస్తున్నారు.

"ఎవరతను? అతనుచేసిననేరమేమిటి?" ప్రక్కనున్న అతనిని ప్రశ్నించాడు చంద్రం.

"ఒక వద్దెనిమిదేళ్ళ అమ్మాయిని అమానుషంగా చెరిచాడు. ఆమె చావుబ్రతుకుల్లో ఉంది. పోలీసులు పట్టుకున్నారు." అతను చెప్పాడు.

చంద్రం అప్రయత్నంగా అతనివైపు చూశాడు. అతని ముఖంలోనూ కండ్లలోనూ అనుమానించడానికి ఎట్టి ఛాయలూ

కనిపించలేదు. "మనిషి లోపల మనిషి ఉంటాడు. అతడు ఎప్పుడూ పశువే. లోపల మనిషి మనిషిగా ప్రవర్తిస్తేచాలు. అప్పుడు అతను నిజమైన మనిషి అవుతాడు." గొణుక్కున్నాడు చంద్రం.

"నేను నేరస్థుడనే. నేను కమలను నిర్దాక్షిణ్యంగాచెరిచాను. నన్ను క్షమించండి" గట్టిగాఅరవాలనుకున్నాడు. మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

ఇంటికి చేరిన చంద్రం కోవెలవైపు వెళ్ళ సాహసించలేదు. తోటలో తిరుగుతూ ఉండిపోయాడు. ముందుకు కదలలేకవెనుకకు పోలేక తోటలోనే తిరుగుతూ కోవెలలో వినిపించే గంటలకోసం నిరీక్షించ సాగాడు. చీకటి పడింది. కాని కోవెల నుండి యధావిధిగా వినిపించే గంటలు వినిపంచలేదు. "నేను వినలేదా? కమల కోవెలకు రాలేదా?"– మనసునిక నిగ్రహించుకోలేక పోయాడు. గబగబా కోవెలవైపు పరుగుతీశాడు. కమల కనిపించలేదు. పూజారి తాతయ్యొక్కడే ముఖమంటపంలో రుద్రాక్షమాల తిప్పుకుంటూ స్తంభానికి చేరగిలాపడి కనిపించాడు.

"తాతయ్యా! కమల వెళ్ళిపోయిందా?" ఆతృతగా అడిగాడు.

"ఎవరూ! చంద్రవా? కమల ఈ రోజు రాలేదురా! తనూ, నీవు రాకపోతే మీ తోటకుగాని వెళ్లారేమో అనుకున్నా" అన్నాడతను.

"రాలేదా తాతయ్యా! కమల రాలేదా? ఏమయింది కమలకు కమలఏమయింది" గొణుక్కుంటూ ఊరిలోకిపరుగెత్తాడు.చంద్రం. కమల మేడముందుకి వచ్చేసరికి కాళ్ళు వణికాయి. గుండెవేగాన్ని మించి స్పందించ సాగింది. గొంతు తడారిపోయింది. భయం భయంగా తలఎత్తి మేడవైపు చూశాడు. ఇంటిలో దీపాలువెలుగు

తున్నాయి. కాని కమల అతనికి కనిపించలేదు. నిరాశతో తిరిగి వచ్చాడు. ఆ రోజు రాత్రి అతనికి భోజనం సహించలేదు.

జ్వరంతో బాధపడుతూ మూలుగుతున్న కమల కనిపించిందాతనికి కలలో, ఆ రాత్రి.

మరునాడన్యమనస్కంగానే గడిపి, సాయంత్రం మయ్యేసరికి పూవులతో కోవెలకు పరుగెత్తాడు. అతను కళ్యాణ మండపం సమీపించే సరికి అయిదు గంటలు వినిపించాయి. ఆనందంతో కళ్యాణమండపం చేరాడు. అతను చేరి౦త త్వరగా పరుగెత్తుకుంటూ వచ్చింది కమల. ఆమెను చూడగానే పురి విప్పిన నెమలి అయింది అతని మనసు "కమలా!" ఆనందంతో కదిలాయాతని పెదవులు. "చంద్రం!" ఆనందంతో అంది కమల.

"నిన్న రాలేదేం కమలా? నీవు రాకపోతేఏమయిపోయావో నీకేమయి పోయిందో అని నేనెంత భయపడ్డానో తెలుసా?"

"రాలేకపోయి రాలేదు చంద్రం. అయినా నే నేమవుతాను? నా కేమవుతుంది?"

"మొన్నరాత్రి వర్షంలో తడిశావుగా. అందుకని జ్వరమొచ్చిందేమోనని ఎంత కంగారు పడ్డానో తెలుసా?....అంతేకాదు మరి....మరి.. ."

"మరి....మరింకేమయింది?" కుతూహలంతో అడిగింది కమల. చంద్రం తలఎత్తి ఆమె బుగ్గల వైపు చూశాడు. ఆమె వక్షం వైపు చూడలేక తలదించుకున్నాడు.

"చంద్రం! మాటాడవేం?" అతని చెయ్యిపట్టుకుందికమల. చంద్రం గొంతులో నీళ్ళు కదిలాయి. ఆమెచేతిని తన రెండు చేతులలోకి తీసుకుని "కమలా? నన్ను క్షమించు మరి

నన్నెప్పుడూ బాధ పెట్టను" అన్నాడు. అతనా మాటల నెందు కన్నాడో కమలకు అర్థం కాలేదు.

"చంద్రం! ఎందుకంటున్నావీ మాటలు. నిన్న నేరాలేదనేగా రావాలని ఎంత ప్రయత్నించానో నీకేం తెలుసు. సరిగా కోవెలకు బయలుదేరే వేళకు శకుంతల వచ్చింది. శకుంతల ఎవరో తెలుసా? మా ప్రక్కింటి శేషయ్య గారమ్మాయి. నా కన్న రెండేళ్ళు పెద్ద క్రిందటి సంవత్సరమే ఆమెకు పెళ్ళయింది. సూడిదకు తెచ్చారు. తొమ్మిదో నెల వచ్చేంతవరకు అత్తవారు పంపలేదు నిన్ననే శకుంతలకు గాజులు పెట్టించారు. నేనుండక తప్పలేదు. శకుంతల ఎంతకీ వదిలి పెట్టలేదు. ఏం చేయను? అప్పటికీ చీకటి పడిం . అయినా వచ్చేద్దామనుకున్నాను. అమ్మ వద్దంది. రాత్రి ఎంతసేపు ఏడిచానో నీకేం తెలుసు? మరింకా నా మీద కోపమా?" అతని ముఖంలోకి చూస్తూ అంది కమల.

"కోపం కాదు కమలా....కమలా....ఇలారా! అదిగో.... అటు చూడు....అక్కడ ....ఆ గోడమీద – పార్వతీదేవి శిల్పం చూడు....అందగా లేదూ—?" అన్నాడు. నిలబడివున్న నల్లరాతి పార్వతీదేవి విగ్రహాన్ని చూచింది కమల. ప్రతి రోజూ ఆకృతిని చూస్తోందామె. అందులో ఆమెకు క్రొత్తదనమేదీ కనిపించ లేదు.

"అవును. అందంగా ఉంది" అంది అంగీకరిస్తూ కమల.

"నీకన్నా అందంగా మాత్రం లేదు" అన్నాడు. కమల మాటాడలేదు.

"ఈ అందం చిరకాలముండాలి కమలా! చెదరకూడదు. వాడకూడదు" అన్నాడు. కమల సిగ్గుతో తలవంచుకుంది. కళ్ళ లోంచి ఒక ప్రక్క గర్వం తొంగిచూస్తోంది. "కమలా!" అనురాగం,

ఆత్మీయత, ప్రేమ, అభిమానం అన్నీ సామూహికమై ధ్వనించే గొంతుతో పిలిచాడు. కమల తల ఎత్తి చూచింది. ఆమె కళ్ళలోకి తృప్తిగా చూచి కన్నీరు తుడుచుకున్నాడు.

"చంద్రం! కోవెలలోకి వెళ్దామా? శకుంతల వచ్చేస్తుంది." అడిగింది కమల.

"శకుంతలా- ఎందుకొస్తుంది?"

"దేవుణ్ణి చూదామనే. అసలు కలిసే వెళ్దాం ఆగమంది. ఆమెతో కలిసివస్తే నీతో మాటాడటం కాదని చిన్న సాకుచెప్పి ముందుగా వచ్చేశాను. పద" అంది.

ఇద్దరూ కోవెలలోకి కదిలారు త్వరగా.

"నిన్న నీవు రాలేదు. చంద్రం పిచ్చివాడై పోయాడమ్మా!" అన్నాడు పూజారి తాతయ్య.

"ఇంకలా కాదులే తాతయ్యా! ఇద్దరం కలసే వస్తాం!" అంది కమల తీర్థం తీసుకుంటూ. చంద్రంవైపు కొంటెగాచూస్తూ. చంద్రం నవ్వాడు.

ముఖ మంటపం వదలి కళ్యాణ మంటపములోకి కదులుతూ ఉంటే చెల్లెల్ని, తమ్ముణ్ణి వెంటపెట్టుకుని వస్తున్న శకుంతల కనిపించింది కమలకి.

"అదిగో శకుంతల" అంది కమల. చంద్రం అటువైపు చూశాడు.

"అదేమిటి శకుంతల అలా ఉంది?" అన్నాడు.

"ఎలా ఉంది? శకుంతల శకుంతలలా ఉంది." అంది కమల.

"కాదు ఆ ఎత్తైన పొట్ట.... ఆ నడక....ఛీ! ఛీ!! సిగ్గు వేయటం లేదు?"

"సిగ్గా? ఎవరికి? నీకా! నాకా! తనకా? ఎందుకుసిగ్గు? ఎందుకు నీకీ అసహ్యం?"

"అసహ్యమే కమలా!....రోత"

"అయితే....నన్నూ అలానే అసహ్యించుకుంటావా?"

"కమలా!" అంటూ ఆమె చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"మన పెళ్ళయితే....నేనూ ఇలాగే...." చెప్పలేక తల దించుకుంది.

"కమలా!" తల విదుల్చుకున్నాడు.

"చెయ్యి వదులు, శకుంతల చూస్తుంది" అందికమల. చంద్రం చెయ్యివదిలేశాడు. కమల శకుంతల కెదురుగా వెళ్ళింది. చంద్రంయాంత్రికంగా అడుగులు వేసికుంటూ ఇంటికి కదిలాడు. భోజనం సరిగా చేయలేకపోయాడు.

"చంద్రం! నీవు రెండురోజులనుండి ఏదోలా ఉన్నావు? ఏమైంది? నీవూ కమలా తగవుపడ్డారా?" అడింగిదాతనితల్లి.

"లేదమ్మా! ఏదోమనసులో వెలితిగా ఉందమ్మా" అంటూ విస్తరిముందునుండి లేచిపోయాడు చంద్రం.

నిద్రసరిగారాలేదు.పట్టినాఅదికలతనిదురే. ఆ కలతనిదురలో కమల-తనలోఅంతపక్కు నిద్రపోతున్న చంద్రంగాఢపరిష్వంగంలో వర్షంలోతడిసిన కమల- అమానుషంగా హింసింపబడుతున్న కమల పూర్తిగనగ్నంగాఉన్న కమల- సిగ్గులేక ఆమెనేచూస్తున్న చంద్రం- శకుంతలలా వికృతంగా కమల- వర్షం, ఉరుములు,

మెరుపులు- నగ్నంగా పరిగెడుతున్న కమల- ఆమెవెనుక చంద్రం- పశువులా.... బలవంతంగా.... అయినా ఆమెనవ్వుతోంది- మళ్ళీ ఉరుములు మెరుపులు- వర్షంలో- శకుంతల్లా! ........ ఛీ — ఒక్క ఉదుటున లేచాడు చంద్రం. చుట్టూ చూశాడు. అంతా చీకటి. గదిలో ఒకమూల మూగన్నుపెట్టి నిద్రపోయే హరికెన్ లాంతరు. ప్రక్క గదిలో నిద్రపోతున్న తల్లి- మంచందిగి తోటలోకినడిచాడు. దూరంగాపొలాలలోనక్కల అరుపులు. మామిడితోటలోగుడ్లగూబల అరుపులు. ప్రక్కపొలాలలో రాబందుల రెక్కలచప్పుళ్ళు. చీకటిని మరింతభయంకరంగా రూపొందిస్తున్నాయి. ఇల్లుచేరాడు. తలుపు తెరుస్తూంటే-

"చంద్రం! ఎక్కడికెళ్ళావు?" తల్లి ప్రశ్నించింది.

"తోటలోకి వెళ్ళానమ్మా" అన్నాడు. ఆమె మరేమీ ప్రశ్నించలేదు. చంద్రం ఆలోచనలు తల్లి మీదకు మరలాయి. తలచుకో బుద్ధికాలేదు. మనసులో ఒక నిర్ణయాన్ని చేసికున్న తరువాత అతనికి నిద్ర పట్టింది.

మర్నాడు సాయంత్రం పువ్వులు తీసికునివెళ్ళేసరికి కమల ఇంకా రాలేదు. కమలతో మాటాడవలసిన మాటల పునశ్చరణ చేసికున్నాడు. అంతలో కమల వచ్చింది. దైవదర్శనం చేసికున్న తరువాత కల్యాణ మంటపంలోకి కదిలారిరువురు.

"ఏమిటి ఇవ్వాళ ఇంత మవునంగా ఉన్నావు?" అడిగింది కమల.

"కమలా నిన్నొక ప్రశ్న అడగనా?" అన్నాడు నెమ్మదిగా చంద్రం.

"అడుగు చంద్రం. సంశయమెందుకు?"

"నిజంగా నేనంటే నీ కిష్టమేనా?"

"ఈ ప్రశ్న నీవు అడుగుతున్నావా? నీకు సమాధానం తెలియదా? అయినా చెప్తున్నాను విను. నీవంటే నాకు చాలా యిష్టం. గౌరవం కూడా." అంది కమల.

"నేనూ చెపున్నా వినుకమలా! నీ వంటే నా కెంతో యిష్టం. ఎంతయిష్టమంటే నీకేమైనా నేను సహించలేను. నీ కోసం నేనే మయినా వదులుకుంటాను. నీవు మాత్రం హాయిగా సుఖంగా ఉండాలి. ఈ పువ్వు వాడకూడదు. నీ తలపూలు నలగకూడదు. ఈ శిల్పం చెదర కూడదు".

"నీవు నన్ను అనుమానిస్తూ అడిగావుగాని నేను నిన్ను అడిగానా? నీ మనస్సు నాకు తెలియదా? ఎందుకిన్ని చెప్తున్నావ్" అడిగింది కమల.

"నీకోసం కమలా. చెప్తున్నాను విను. మనం పెళ్ళి చేసికోవద్దు...."

"చంద్రం!" తుళ్ళిపడింది కమల.

"అవును కమలా!"

"చంద్రం! నీవేమంటున్నావో నీకు తెలుస్తున్నదా?"

"తెలుసు కమలా!"

"పెళ్ళి చేసికోక ఏం చేద్దామని?"

"స్నేహితులంగా ఉందాం"

"అలావుండే అవుసరం మనకేముంది? మనమెందుకు పెళ్ళి చేసికోకూడదు?"

"నీ కోసం-నా కోసం-నీ అందం చెదరక ఉండేందుకు."

"పెళ్ళి కాకపోతే ఈ అందం ఇలా నిలచి ఉంటుందా? నీ వెందుకిలా ఆలోచిస్తున్నావు? మనమిలా ఉండాలాని శాసించకు చంద్రం. నీకిప్పుడు పెళ్ళియిష్టంలేకపోతేచెప్పు..... ఒకసం వత్సరమేకాదు..... పదిసంవత్సరాలేకాదు..... ఎంతకాలమైనా ఉంటాను. ఆలోచించు చంద్రం. నన్ను మాత్రం అలాశాసించకు."

"కమలా! మనమెందుకు పెళ్ళిచేసుకోవాలి.?"

కమల అతని కళ్ళలోకి తీక్షణంగా చూసింది.

"చంద్రం! నీవుమారిపోయావు. నిన్నెవరోమార్చేశారు. నీవేమిమాటాడుతున్నావో నీకుతెలియుటంలేదు. స్త్రీని. నన్నెందుకలా నిలదీసి అడుగుతావు. నాకు నాజీవితంకావాలి. నాజీవితం ఇల్లాలిగా సార్థకంకావాలి. ప్రతీస్త్రీ పొందే అనుభూతులనేనూ పొందాలి..... ఇంకాస్పష్టంగా నీకు నేనేంచెప్పాలి.

"క్షమించు కమలా! నిన్నవమానించాలని నిన్నిలా ప్రశ్నించలేదు. నీవుకూడా అందరిస్త్రీలలా ఆలోచిస్తున్నావు. పెళ్ళిఒక్కటే ఏ వ్యక్తి ధ్యేయంకాదు కమలా. అదితెలిసికున్నవారే ఉన్నతులు. ఇంతకాలంనీమీదనున్న ఆరాధనను;నాశరీరావసరాలకోసంబలిచేయలేను.నాఅవసరాలతీర్చుకోవడంకోసం నీఅందాన్ని నాశనముచేయలేను.చిత్రకళలోనే ఇంకాఉన్నత ప్రమాణాలసాధించాలికమలా! అందం చెడకూడదు. అందుకని మనం పెళ్ళిచేసుకోకూడదు."

"నా మీద నీ కున్నఆరాధనకు నా కెంతో ఆనందంగా ఉంది. నీవన్ని విధాల ఉన్నతుడవుకావటంనాకిష్టమే.నా సంపూర్ణ సహకారం నీకెప్పుడూ ఉంటుంది. అది నేను నీ సమీపంలో

ఉన్నప్పుడే ఎక్కువసాధ్యమవుతుంది. అందుచేత మనం పెళ్ళిచేసుకోవాలి చంద్రం.''

"కూడదు కమలా! పెళ్ళిచేసికుని సామాన్య మానవుల్లా బ్రతకటం నా కిష్టంలేదు."

"చంద్రం! నీ మనసు నా కర్థమైంది. కడసారిగా అడుగుతున్నాను. నన్ను పెళ్ళిచేసికో. నేను నీ దారికి అడ్డురాను. నీవు నన్ను తాకవద్దు. నేను నిన్ను తాకను. మనం స్నేహితులవలె ఉందాం. నీ యిష్ట ప్రకారమే. నీ వెలా చెప్తే నేనలా నడుస్తాను."

"అగ్ని ప్రక్కన కరుగని నెయ్యి ఉంటుందా కమలా! నేను మృగాన్ని కాగోరటంలేదు."

"ఆ మాటనకు చంద్రం! అది మృగలక్షణంకాదు....అయినా నేను హామీ యిస్తున్నానుగా చంద్రం"

"..................."

"దిగజారిపోతానేమో అని భయపడే నీవు పైకెలాపోగలవు చంద్రం!"

"కమలా!"

"నేను నిజమే మాటాడుతున్నాను. వివాహం లేకుండ మగవాడివి–ఏ కళంకం లేక నీవు ఉండగలవేమో గాని నేను స్త్రీగా గౌరవంగాబతకలేను. నాయిల్లునాకుకావాలి. నాస్థానం నాకుకావాలి."

"అంటే?"

'నేను పెళ్ళి చేసుకుంటాను."

"ఎవరిని?"

"నీవు కానప్పుడు నాకెవరైనా ఒకటే"

"కమలా? నీవు పెళ్ళిచేసుకోవటానికి వీల్లేదు" అరిచాడు చంద్రం.

"అని శాసించటానికి నీకేం హక్కుంది? నా బొమ్మలు నాలుగు చేసినంత మాత్రాన నేను నీదాననుకాను"

"శాసించటంకాదు కమలా! అర్థిస్తున్నాను. నీ అందాన్ని నాశనం చేస్తానన్న భీతే నన్ను పెళ్ళి చేసి కోకుండ ఆపింది. ఇప్పుడు మరొకరు నాశనం చేస్తారంటే యిష్టపడతానా?

"నీ ఇష్టంతో నాకేమి సంబంధం?"

"కమలా అంత అన్యాయంగా మాటాడకు"

"అలా అన్యాయంగా మాటాడేది నీవు. ఇన్నాళ్ళుగా నే పెంచుకున్న ఆశల్ని తెంచి పారేశావే! ఎవరిది అన్యాయం? స్త్రీ వల్ల పతనమైపోతానని భయపడే నీవు స్త్రీ నేమాత్రంగౌరవించ గలవు! నీ వెనుకునే నాశనం ఉందీ; లేదు. నేను శాశ్వతంకాను. నా అందం శాశ్వతంకాదు. కాని శాశ్వతమే. ఒకసారి తిరిగి ఆలో చిస్తే చాలా సంతోషిస్తాను"

"తిరిగి ఆలోచించాల్సింది నేనుకాదు కమలా! నీవే!"

"కాదు నీవే! నీవు నన్ను కాదన్నావు. నేను ఉరిపోసుకుని చస్తాను"

"కమలా!"

"నా అందాన్ని పెళ్ళిచేసికోకండా రక్షించగలవా? నీకు దూరమైనానని కుమిలి పోతూ ఏడుస్తున్నానే. నా ముఖంలో నవ్వును నాకు దూరంగా ఉండి తేగలవా?"

"అది నీలో ఉంది కమలా! పెళ్ళి విషయం మరచిపో"

"అంతేనా?"

"అంతే!"

"అయితే మీరు కమల గురించి ఆలోచించకండి. మళ్ళీ మనం కలియం" అంటూ పూల సజ్జను తీసికుని చకచకా సాగి పోయింది కమల.

ఆనాటి నుండి కమల కోవెలకు రావటం మానేసింది. చంద్రం మాత్రం ప్రతి దినం వస్తునే ఉన్నాడు. ఎప్పటికైనా కమల తన ఆలోచనలను సరిదిద్దుకుని తిరిగి వస్తుందన్న ఆశ. ఏ నాటికైనా "కమలా నిన్నే పెళ్ళి చేసికుంటాన"ని అతడు వస్తాడని ఆమె ఆశ. నెలయుగాలు గడిచాయి.

ఎవరనుకున్నట్టూ జరగలేదు.

"కమల రావటం లేదేం?" అడిగాడు పూజారి తాతయ్య.

"కమల మరిరాదు తాతయ్యా" అన్నాడు చంద్రం.

"ఎందుకనీ?" అడిగాడు తాతయ్య "అదంతే" అన్నాడు చంద్రం.

—అంతే—అదే ఓవరిసారి చంద్రం కోవెలలోకి వెళ్ళటం. ప్రతిరోజూ కళ్యాణ మంటపంలో మాత్రంచీకటిపడేవరకు కూర్చుని వస్తాడు. కమల కోవెలకురాదు. చంద్రం ఆమెను చూడరాదు. దానర్థం ఒకరినొకరు మరచిపోయారన్నది మాత్రం నిజంకాదు. గుర్తుపెట్టుకుని బాధపడటంలో సుఖం లేదనిపించింది కమలకు తల్లికి తన పరిస్థితిని వివరంగా చెప్పింది. "నన్నేం చెయ్యమంటావమ్మా?"—తల్లి నడిగింది.

"అతను నిజం తెలిసికునే సరికి ఎన్ని సంవత్సరాలయినా పట్టవచ్చు. అటు తరువాత మొండితనానికైనా అతడు నిజాన్ని అంగీకరించడు. అతను నిజం తెలిసికునే సరికి మీరు ముసలి

వారై పోతారు. అదీగాక మీమానాన్నను నేనెంతకాలం మభ్య పరచగలము. ఈ నిజం తెలిసిన నేను మాత్రం నిన్నిలా ఎంత కాలం చూస్తూ ఉండగలను? నీవు కాదనక అతని మీద ఆశలు వదులుకో తల్లీ? నీకు నచ్చినఏసంబంధం మైనాచేస్తాం" అందామె.

"ఇక నాయిష్టమేముందమ్మా! మీకు యిష్టపడితే నే కాదనను" అంది కమల.

మరో నెలకే ఆమె పెళ్ళి నిశ్చయమైంది. చంద్రం ఖిన్నుడయ్యాడు.

"ఏమిటి చంద్రం? ఎందుకిలాజరిగింది?"అడిగిందాతనితల్లి.

"మా అభిప్రాయాలు కలియలేదమ్మా!"

"ఇంతకాలం కలిసి తిరిగిన తరువాత కమల అభిప్రాయాలు నీకు నచ్చలేదా చంద్రం? నీ వెక్కడో పొరపాటుపడ్డావు. చేజేతుల రత్నాన్ని వదులుకున్నావ్. ఇకనైనా మించిపోయిందిలేదు. నేను కమల తల్లిదండ్రులతో మాటాడుతాను." అందామె.

"వద్దమ్మా! నేను కమలనే కాదు మరెవరినీ పెళ్ళిచేసికోను"

"చంద్రం!" అదిరి పడిందామె.

"అవునమ్మా!" అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు చంద్రం.

కమల పెళ్ళయిపోయింది.

మర్నాడు సాయంత్రం తల్లితో కోవెలకు వచ్చింది కమల.

"మళ్ళీ ఎప్పుడు వస్తావు?" అడిగాడు చంద్రం.

"ఎప్పుడైనా వస్తాను కాని నీకు కనిపించను. నీ ఊహలు చెడగొట్టటం నా కిష్టంలేదు. ఇంతవరకు నీకు తెలిసిన కమలనే

దృష్టిలో ఉంచుకుని చిత్రాలు గీసికో. నీకు నేను అనుమతిస్తు న్నాను. నేను నీకు చేయగలిగిన సహాయమిదే. ప్రకృతిలో అందమేకాదు. అనాకారితనం కూడ ఉంది. కాని నీవు అనాకారి తనాన్నే చూడ నేర్చుకున్నావ్! అందానికి-అనాకారితనానికి పెద్ద తేడా ఏం లేదు. ఉన్నతేడా అంతా మనదృష్టిలోనే....... ఎవరైనా మంచి అమ్మాయిని చూచి పెళ్ళిచేసికో....ఇది నా సలహా!'' అని చెప్పి అతని సమాధానం కోసంవేచిఉండకపెళ్ళిపోయిందికమల.

కమలను దృష్టిలో ఉంచుకుని చిత్రాలు గీయ ప్రయత్నిం చాడు. కాని ఆమె ధరించబోయే వికృత రూపము అతనికి కని పించ సాగింది. కాన్వాసు మీద కుంచెను పెట్టే ప్రయత్నాన్ని విరమించాడు. కథలకు గీయుబడే చిత్రాలయినా యాంత్రికంగా గీయబడేవి.

చంద్రం కొట్టిన దెబ్బకు ముసలి మనసు బాగగాయపడింది మనసుకు తగిలిన గాయం పెద్దదయింది. చీము పట్టింది. కుళ్ళి పోయింది.

సాయంకాలం వంటచేసి కోవెలనుండి వచ్చే చంద్రం కోసం ఎదురుచూస్తూ మేను వాల్చిన ఆమె శాశ్వతంగా నిద్రపోయింది. తల్లి మరణంతో ఒడ్డునపడ్డ చేపలా గిలగిల లాడాడు. కమల కని పిస్తే ఏదో చెప్పుకుని ఏడ్వాలనుకున్నాడు కాని కమల కనిపించ లేదు. కమల తల్లి దండ్రులు ఆస్తుల నమ్ముకుని మద్రాసులో స్థిర పడేందుకు కొడుకుతో వెళ్ళిపోయారు. "కమల మరి కనిపిం చదు"-నిట్టూర్పు విడిచాడు చంద్రం.

ఆనాటి నుండి ప్రకృతిలో దయనీయమైనపరిస్థితిలో ఉన్న వస్తువులను, మనుష్యులను, జీవులను చూచి ఓదార్పు పొందే వాడు. వాటి ఎడల అతనికి సానుభూతి ఏర్పడింది. వాటిని జాలితో చూచేవాడు. తాను చూచింది. నలుగురికి చెప్పాలనే తహతహ అతనిలో కలుగి సాగింది. అతని పట్టుదల కాన్వాసుపై రూపులు

దిద్దుకో సాగింది. అవి నిజాయితీని ధ్వనించసాగాయి. వ్యాపార సరళిని సాగని అతని చిత్రలేఖనం కళాకారులను ఆకట్టుకుంది. చంద్రం అందరి మెప్పు పొందే చిత్రకారుడయినాడు.

సుమారు పద్దెనిమిది సంవత్సరాలు ఆ తపసులో గడిపాడు చంద్రం.

తరువాత–ఒకనాటి సాయంత్రం కళ్యాణమంటపంలో తాను గీసిన చిత్రాన్నే తదేకంగా చూస్తున్నాడు చంద్రం. అతని జుత్తు ఏపుగా పెరిగింది. గడ్డం, మీసం పెరిగాయి. వెంట్రుకలుకూడా తెల్లబడి స్పష్టంగా కనిపించ సాగాయి. అంతలో కోవెలలో అయిదు గంటలు మ్రోగాయి. త్రుళ్ళి పడ్డాడు చంద్రం. "కమలా!", గావుకేక వేసి తల ఎత్తాడు. కోవెల ముందు కారాగి ఉంది. త్వరగా లేచి ముఖమంటపంపైపు వెళ్ళాడు. ముఖమంటపంలో నిలచిఉన్న ఆమెను చూశాడు గుర్తుపట్టాడు. ఆమె కమల. పెళ్ళయిన తరుణంలో ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది. అతని మనసు ఆనందంతో నాట్యం చేసింది.

"కమలా!" అంటూ ఎదురెళ్ళాడు.

అతని పిలుపు విని, అతన్ని చూచి ఎదురెళ్ళిందామె.

"కమలా! అంటూ ఆమె దగ్గరగా వెళ్ళాడు. ఇంకా స్పష్టంగా చూశాడు. అవే కళ్ళు, అవే చెవులు, అదే ముక్కు ఏమీ మార లేదు. శరీరవర్ణం మాత్రం కొద్దిగ రాగి కలిసిన బంగారంలా మెరిసి పోతున్నది. ఆమె అతన్ని పరిశీలనగా చూసింది. ఒకడుగు ముందుకు వేశాడు. ఆమె ఒక అడుగు వేసింది.

"మీరేనా చంద్రం?" అందామె.

"అవును నేనే గుర్తుపట్టలేదా?" అన్నాడు.

"నేను మిమ్మల్నెప్పుడు చూడలేదు. నా పేరు కమలకాదు. రజని. కమల మా అమ్మ."

"నీవు కమలవు కావూ? కమలకూతురివా? ఎంత ఆశ్చర్యం? ఎలా నమ్మను?"

"మీరు నమ్మలేరు. కాని అమ్మను చూస్తే నమ్మగలరు. అమ్మ ఎడమ కంటిక్రింద పుట్టుమచ్చలేదు. నాకు ఉంది. అమ్మ కన్నా నేకొద్దిగా పొడవు. అమ్మ శరీరవర్ణం పసిమి నేను ఎరుపు - ఇంకాచాలా తేడాలు"

"కాని ఈ వయసులో మీ అమ్మ ఇలాగే ఉండేది. కమల ఇప్పుడెక్కడుంది.? ఏం చేస్తోంది? నీతో వచ్చిందా!" అడిగాడు.

"అమ్మలేదు.నా పెళ్ళయినరెండునెలలకేతనువుచాలించింది.

"కమల లేదూ? కమల ఇకలేదూ?" అంటూ రెండు చెవులు గట్టిగ మూసుకున్నాడు. అతని కనులుఅశ్రుపూరితములయినాయి.

"లేదు చనిపోయే ముందు నన్ను పిలిచి, మిమ్మల్ని చూచి, మీకు కనిపించి రమ్మనిచెప్పింది. అందుకేనేనువచ్చాను." అంది రజనీ.

"మంచిపని చేశావమ్మా! నా కళ్ళు తెరిపించావమ్మా! నాలో చీకటిని పోగొట్టేందుకే నిన్ను నా దగ్గరకు పంపిందమ్మా! కమల లేదని ఎలా అనగలను? నీవు రజనీవి కావని ఎలా అనగలను? చేజేతులా వజ్రాన్ని జారవిడచుకున్న మూర్ఖుడనమ్మా నేను" అంటూ కుప్పలా కూలిపోయాడు చంద్రం!

// — — //